



గద్వాలలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

ప్రారంభమైన స్కానింగ్ సేవలు

- గర్భిణులకు తగ్గిన ఆర్థిక భారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ 7



మాతా శిశు సంరక్షణ కేంద్రంలో స్కానింగ్ కోసం వేచి ఉన్న గర్భిణులు

ఉగ్రదాడిపై.. ఆగ్రహం

- కశ్మీర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన
- ఊరూరా కొవ్వొత్తులతో ప్రదర్శనలు
- అమరులకు నివాళి అర్పించిన నాయకులు

6



బిజినేపల్లిలో కొవ్వొత్తులు వెలిగించి పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళి అర్పిస్తున్న హిందూ, ముస్లింలు


మండుతున్న.. ఎండలు

- అత్యధికంగా గద్వాల జిల్లా మల్దకల్‌లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యల్పంగా వనపర్తి జిల్లా రేవల్లిలో 24.0 డిగ్రీలు
- బయటికి రావాలంటే జంకుతున్న ప్రజలు
- మూడు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రత
- తీవ్ర ఇబ్బంది పడుతున్న చిరు వ్యాపారులు



నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని ప్రధాన రహదారి

నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు ఎండల మండుతున్నాయి. వారం రోజులుగా సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైగా నమోదవుతూ వస్తోంది. నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో బుధవారం గరిష్ఠంగా 42 డిగ్రీలు దాటింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 24 నుంచి 29 వరకు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి ఎండల ప్రభావం తీవ్రమవుతోంది. మధ్యాహ్నం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఎండలకు భయపడి అత్యవసర సమయంలో తప్పా జనాలు బయటికి రావాలంటే జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల ప్రభావంతో చిరు వ్యాపారులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు భయపడుతున్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గద్వాల, ధరూర్‌లలో 42.5, అయిజలో 42.4, కేటీ దొడ్డిలో 42.3, గట్టులో 42.2, అలంపూర్‌లో 424, ఇటిక్యాలలో 41.9, రాజోలిలో 41.4, వడ్డేపల్లిలో 41.1, మానవపాడులో 40.5, ఉండవెల్లిలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లా పెబ్బేరులో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అమరచింత 42.5, ఆత్మకూరు 42.4, చిన్నంబావి 42.4, కొత్తకోట 42.3, పెద్దమందడి 42.2, పాన్‌గల్ 42.1, మదనాపూర్ 42.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రేవల్లి మండలంలో 24.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 41 డిగ్రీలు, కనిష్ఠంగా 28 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 39 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీ సెంటీగ్రేడ్‌లు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీలు నమోదైంది.



గిరాకీ లేక వెలవెలబోతున్న పండ్ల వ్యాపారం



నాగర్‌కర్నూల్ పట్టణంలో ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



కొల్లాపూర్‌లో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



నిర్మానుష్యంగా మారిన (కొత్తకోట బైపాస్ ప్రధాన కూడలి) 44వ జాతీయ రహదారి

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏఈ కొండయ్య

7

ఆటాడుకుందాం.. రా

- వచ్చేనెల 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- గ్రామ స్థాయిలో 10, మునిసిపాలిటీల్లో 5 కేంద్రాలు
- పూర్తయిన శిక్షకుల ఎంపిక



వేసవి క్రీడా శిబిరంలో కరాటే తరగతులకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

10.30లక్షల పనిదినాలు గాయబ్

- ప్రతిపాదించినది 23.84లక్షలు
- అనుమతించిన పనిదినాలు 13.54లక్షలే...
- రూ.12కోట్ల వేతనాలు కోల్పోతున్న కూలీలు
- వందరోజుల పనిదినాలు కష్టమే..!

గద్వాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం పనిదినాలను కుదించింది. గత ఏడాది కూలీలకు 23.20లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం పెట్టుకోగా 24.19లక్షలు పనిదినాలు కల్పించింది. ఈ ఏడాది కూడా 23.84లక్షల పనిదినాలకు లేబర్ బడ్జెట్‌ను ప్రభుత్వానికి నివేదించగా ప్రభుత్వం 13.54 లక్షల పనిదినాలకే అనుమతించింది. అంటే దాదాపు 10.30 లక్షల పనిదినాలు గాయబ్ అయ్యాయి. దీంతో జిల్లాలో కూలీలు రూ.12కోట్ల వేతనాలు(ఆదాయం) కోల్పోయే పరిస్థితి ఉంది. ఉపాధిలో కూలీలకు రోజుకు రూ.307 కూలీ ఇవ్వాల్సి ఉండగా గత ఏడాది సగటున రూ.198 వేతనం లభించింది. ఈ ఏడాది ఇది రూ. 300లకు పైగా పడేవిధంగా కొలతలతో పనులు నిర్వహించి వేతనం (ఆదాయం) తగ్గకుండా చూడాలని అదేశించింది. ఆడిట్ భయంతో టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు ఇచ్చి మరీ పనిచేయిస్తున్నారు. దీంతో పనిచేతకాని కూలీలు ఉపాధి పనులకు రావడం కష్టంగా ఉంది.



ఉండవెల్లి మండలం బొంకూరులో పనులు చేస్తున్న కూలీలు

ప్రశ్నార్థకమైన పనిదినాలు..!

వలసలు నివారించి ఉన్నచోటనే ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది. ఇందుకోసం లేబర్ బడ్జెట్‌లో పనిదినాల సంఖ్య లక్షల్లో ఉండేంది. 2022-23లో 26.43లక్షలకు గాను 27.87లక్షల పనిదినాలు కల్పించారు. 2023-24లో 21.76లక్షల పనిదినాలకు గాను 24.11 లక్షల పనిదినాలు కల్పించారు. 2024-25లో 23.20లక్షల పనిదినాలకు గాను 24.15లక్షల పనిదినాలు కల్పించారు. దీంతో ఎక్కువ కుటుంబాలు 100రోజులు ఉపాధిని పొందేవి. కానీ ఈ ఏడాది ఏకంగా కేంద్ర ప్రభుత్వం 10.30 లక్షల పనిదినాలు తగ్గించడంతో కూలీలు రూ.12కోట్ల ఆదాయం కోల్పోతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్యం చేరడం కష్టమే...!

గత ప్రభుత్వంలో రాగా సాఫ్ట్‌వేర్ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు టార్గెట్‌లు పెట్టేవారు. ఎవరు ఎక్కువ పనిదినాలు కల్పిస్తే వారికి జీతం ఎక్కువ వచ్చేది. తక్కువ పనిదినాలు కల్పించిన వారికి తక్కువ జీతం వచ్చేంది. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత కూడా ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాల చెల్లింపులు రాగా సాఫ్ట్‌వేర్ పద్ధతినే అవలంబిస్తున్నారు. దీంతో తక్కువ పనిదినాలు కల్పించిన వారిని తొలగించేవారు. ఇప్పుడు ఏకంగా 10.30లక్షల పనిదినాలు తగ్గించడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్యాన్ని చేరడం కష్టంగా ఉంది.

తగ్గిన కూలీల సంఖ్య

ఉపాధి హామీ పథకం పనులు నిర్వాహణలో సమూల మార్పుల కారణంగా కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రభుత్వానికి పంపించిన లేబర్ బడ్జెట్ ప్రకారం ఏప్రిల్ నెలలో 5.97లక్షల పనిదినాలు కల్పించాలి. కానీ ఇప్పటి వరకు 80వేల పనిదినాలను మాత్రమే నిర్వహించారు. మరో పదిరోజులు అయిన లక్ష పనిదినాలు దాటని పరిస్థితి ఉంది. గత ఏడాది రోజు 15వేల నుంచి 20వేల మంది కూలీలు వచ్చే వారు ఇప్పుడు 7వేల నుంచి 8వేల మంది కూలీలు కూడ రావడం లేదు.



మానవపాడు మండలం గోకులపాడులో ఆర్‌సీపీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మరణానికి.. రూ.6 వేలు

ముడుపులు ఇస్తేనే బీమా డబ్బులు

- ప్రసవానికి రూ. 3 వేలు..
- కార్మిక శాఖలో ప్రతీ పనికి ఓ రేటు
- సొంతంగా వెళ్తే ఫలితం శూన్యం
- పైరవీకారుల ద్వారా వస్తేనే పనులు

జోగుళాంబ గద్వాల జిల్లాలోని కార్మికశాఖ కార్యాలయం పైరవీకారులకు అడ్డాగా మారింది. రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులకు చెందాల్సిన పథకాలు పొందాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువురాని నిరుపేద కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న అధికారులు, పైరవీకారులు పైసలిస్తేనే పనులు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కార్మికురాలు ప్రసవిస్తే కార్మికశాఖ నుంచి రావాల్సిన రూ.30 వేలు పొందాలంటే పైరవీకారులకు రూ.3 వేలు చెల్లించాల్సిందే.. అదేవిధంగా ఎవరైనా కార్మికులు మృతి చెందితే రావాల్సిన రూ.1.30 లక్షలు పొందాలంటే మధ్యవర్తులకు రూ.6వేలు చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నాయని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు చెల్లించలేని కార్మికులు నేరుగా వెళ్లి ఫైలు అధికారులకు అప్పగిస్తే ఏదో వంకతో రిజెక్టు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

- గద్వాల క్రైం, ఆంధ్రజ్యోతి

6



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ అసిస్టెంట్ కార్యాలయం

పాడి పరిశ్రమను బలోపేతం చేస్తాం

- తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నష్టాల్లో ఉన్న విజయ డెయిరీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించి అండగా నిలిచిందని తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి అన్నారు. పాల ఉత్పత్తులను పెంచి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన పాడి రైతుల సమావేశానికి వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎస్.రెడ్డితో కలిసి ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాల సేకరణ ప్రతీరోజు 4.20 లక్షల లీటర్లు జరుగుతుండగా.. అందులో నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల నుంచి 60శాతం పాలు వస్తున్నాయని తెలిపారు. ప్రతీరోజు విజయ పాలు 2.20 లక్షల లీటర్ల అమ్మకాలు జరుగుతున్నాయని, మరో 2లక్షల లీటర్లు మిగులుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు, అన్ని గురుకులాలకు పాలను విక్రయిస్తుండగా మరో లక్ష లీటర్లు మిగులుతున్నాయని, వీటితో పాల ఉత్పత్తులను చేస్తున్నట్లు తెలిపారు. విజయ డెయిరీ బ్రాండ్‌కు ఓనర్లు ప్రజలే నని అమిత్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వంద కోట్లు మం జూరు చేయడంతో పెండింగ్ బిల్లులను చెల్లించినట్లు ఆయన తెలిపారు. అనంతరం కేవీఎస్.రెడ్డి మాట్లాడుతూ ఆవుపాల ధర తగ్గడం కొంత భారమైనప్పటికీ పాడి రైతుల ప్రయోజనానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే సంస్థ నష్టాల్లోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, ఎస్ఈ దేవేందర్‌రావు, కల్వకుర్తి పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ యాకన్న, పాడి రైతులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, పలువురు బీఎంసీ, ఎంసీసీ అధ్యక్షుడు, నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి

సెలవులొచ్చేశాయ్

విద్యాలయాలకు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో వనపర్తి జిల్లాలోని గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులను బుధవారం కుటుంబసభ్యులు వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు. దీంతో వనపర్తి ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా మారింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



విద్యార్థులతో కిక్కిరిసిన వనపర్తి బస్టాండ్



వనపర్తి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడిన విద్యార్థులు

7



లగేజీతో వెళ్తున్న విద్యార్థి, కుటుంబ సభ్యుడు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య జైలుశిక్ష విధించారని ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వారిలో పట్టణానికి చెందిన ఎండి.అక్తర్, సురేందర్‌కు వంద రూపాయల జరిమానా, రెండు రోజుల జైలుశిక్ష విధించారు. అలాగే శ్రీపురం గ్రామానికి చెందిన రాజుకు వంద రూపాయల జరిమానా, మూడు రోజుల జైలుశిక్ష, పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన రాజ్‌కుమార్‌కు వంద రూపాయల జరిమానా, ఒకరోజు జైలుశిక్ష విధించారు.


కోయిలకొండలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న నాయకులు


జడ్చర్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, శ్రద్ధాంజలి ఘటిస్తున్న వివిధ పార్టీల నాయకులు


నారాయణపేట శిశుమందిర్‌లో మౌనం పాటిస్తున్న విద్యార్థులు

ఉగ్ర దాడిపై ఆగ్రహం

- కశ్మీర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన
- ఊరూరా కొవ్వొత్తులతో ప్రదర్శనలు
- అమరులకు నివాళి అర్పించిన నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నారాయణపేట/ నారాయణపేట న్యూటౌన్/ నర్వ/ కోయిలకొండ/ గద్వాల సర్కిల్/ గద్వాల టౌన్/ మరికల్/ మక్తల్/ జడ్చర్ల/ తెలకపల్లి/ నాగర్‌కర్నూల్ టౌన్/ బిజినేపల్లి/ కల్వకుర్తి/ పెద్దకొత్తపల్లి/ వనపర్తి విద్యావిభాగం/ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్, పహెల్గామ్ ఉగ్రదాడిపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబికింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా దుర్ఘటనకు నిరసనగా బుధవారం వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడి మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

● ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంతాపంగా బుధవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలో వివిధ పార్టీల నాయకులు, సంస్థల ప్రతినిధులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నేతాజీ చౌరస్తాలో మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు సంతాపం తెలిపారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్ఎస్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

● నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

● నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండలోని వివేకానంద చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు కొవ్వొత్తులు వెలిగించి, మృతులకు నివాళి అర్పించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కాగడాలు, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్, ప్రవీణ్ సేవా సమితి ఆధ్వర్యంలో క్రీడాకారులు స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పీజీ కేంద్రం వద్ద అమరుల చిత్రపటాలకు విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంఘం నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో హిందూ సంఘాలు, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు.

● తెలకపల్లి మండల కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

● బిజినేపల్లి మండల కేంద్రంలో హిందూ, ముస్లింలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పూలే అంబేడ్కర్ చౌరస్తాలో నివాళి అర్పించారు.

● కల్వకుర్తిలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ, బజరంగ్‌దళ్, హిందూవాహిని, ఐక్యవేదిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

● పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తాలో నివాళి అర్పించారు.

● వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు


వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకుల కొవ్వొత్తులతో ప్రదర్శన


కల్వకుర్తిలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వీహెచ్‌పీ, వివిధ హిందూ సంఘాల నాయకులు


నర్వలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి


పెద్దకొత్తపల్లిలో నిరసన తెలుపుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు


గద్వాలలో కొవ్వొత్తులు, కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు


ఆలయ ప్రాంగణంలో జిల్లా న్యాయాధికారి ఎన్ ప్రేమలత, న్యాయవాదులు

అలంపూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, శక్తిపీఠం అలంపూర్‌ను బుధవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. గద్వాల జిల్లా నూతన న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రేమలత జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అలంపూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మిథున్ తేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులు, న్యాయవాదులు నారాయణరెడ్డి, సురేశ్‌కుమార్ పాల్గొన్నా రు. టీవీ సీరియల్ నటులు జాకీ, హరిత దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని పూజలు చేశారు. అంతకుముందు వారికి ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గణపతిపూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేశారు.


ఆలయ ప్రాంగణంలో జాకీ, హరిత దంపతులు

ఉగ్రవాద దాడిని సమాజం ఖండించాలి

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి

పాలమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడిని సమాజం ఖండించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదులు పర్యాటకుల మీద విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 26 మందిని బలి తీసుకున్నారని తెలిపారు. కశ్మీర్ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసినా, రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించినా, ఆర్టికల్ 370ని రద్దు చేసి భూములను, సహజవనరులను ఓపెన్ మార్కెట్‌గా మార్చినా కశ్మీర్‌లో ఇలాంటి దాడులు ఎందుకు జరుగుతున్నాయో దేశం ఆలోచించాలని పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరిగే సందర్భాల్లో ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

కాల్పుల విరమణ ప్రకటించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావో యిస్టు పార్టీ కాల్పుల విరమణ ప్రకటించి బస్తర్‌ను, ఆదివాసులను కాపాడాలని పాలమూరు అధ్యయన వేదిక (పీఏవీ) ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచా రి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వ బలగాలు హోంమంత్రి ఆదేశాలతో బస్తర్‌లో కాల్పులు జరుపుతున్నాయని తెలిపారు. కాల్పుల్లో మావో యిస్టులతో పాటు ఆదివాసీలు, వారి పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం, కాల్పులను విరమించి ఆదివాసీలను కాపాడాలని పీస్‌కమిటీ, భారత్ బచావో, పీయూసీఎల్‌తో పాటు, వందకు పైగా సంస్థలు కోరినట్లు పేర్కొన్నారు.

కాల్పులను విరమించి చర్చల్లో పాల్గొనేందుకు మావోయిస్టు పార్టీ సమ్మతి తెల్పిందన్నారు. ప్రభుత్వం కూడా కాల్పులను ఆపి ఆదివాసీల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమాజం ప్రజాస్వామిక శాంతిని కోరుకుంటు న్న దృష్ట్యా ఇరుపక్షాలు కాల్పులను విరమించాలని డిమాండ్ చేశారు. కర్రె గుట్టల నుంచి సైన్యాన్ని ఉపసంహరించాలని హోం మంత్రికి, ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి మనవి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభ చాటిన 'సీవీ రామన్' విద్యార్థులు


విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, అధ్యాపకులు

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సీవీ రామన్ విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చరణ్ తేజ 993, అర్షియా 993, రాధిక 992, టీసీ అక్షయ 992, విశ్వతేజ 992 మార్కులు సాధించారు. బైపీసీలో అక్షయ 988, మౌనిక 984, శ్వేత 982, నవ్య 982 మార్కులు సాధించారు. సీఈసీలో వెంకట్ 983 మార్కులతో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సానియా 467, శ్రావణి 465, తనుశ్రీ 464, సుకన్య 464, శ్రీహర్ష 463, ఐశ్వర్య 462, హేమలత 462, అక్షయ 462 మార్కులు సాధించారు. బైపీసీలో లక్ష్మీనారాయణ 435, మధుమోహన్‌రెడ్డి 431, ఎంఈసీలో నందిని 490, జ్ఞానేశ్వరి 485, సీఈసీలో వైష్ణవి 440 మార్కులతో రాణించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులను కరస్పాండెంట్ వీరయ్య, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి కుమారస్వామి, ప్రిన్సిపాల్ ప్రకాశ్, మల్లికార్జున్ అభినందించారు.


సత్తా చాటిన 'విజ్ఞాన్' విద్యార్థులు


విద్యార్థులతో విజ్ఞాన్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

వనపర్తి విద్యావిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరా ఫలితాలలో విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీలో రేణుక 993, గాయత్రి 989, పావని 987, భార్గవి 987, ఉమేశ్వరి 984, మార్కులతో రాణించారు. బైపీసీలో శ్రావణి 968, అశ్విని 953, తన్మయి 952 మార్కులతో సత్తా చాటారు. సీఈసీలో అరుణకుమార్ 971 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో భవాని 466, అశ్విత 464, తేజశ్విని 458, ఎస్ఎండీ సోహెల్ 458, దివ్య 457 మార్కులు సాధించారు. సీఈసీలో గణేష్ 487, బైపీసీలో పావని 417 మార్కులతో సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజ్ఞాన్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ రాజేశ్, అధ్యాపకులు అభినందించారు.

బైక్ పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన యాలాల మల్లయ్య(52) నాగర్‌కర్నూ ల్‌లోని సమీప బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు నాగపూర్ నుంచి బయలుదేరాడు. నాగనూల్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు బైకుపై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆ దారిలో వచ్చిన వారు గమనించి ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడు మల్లయ్య వద్ద ఉన్న ఫోన్ ద్వారా వారి బంధువులకు సమాచారం అందించామని, అతని కుమారుడు యాలాల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


యాలాల మల్లయ్య (ఫైల్)

మరణానికి రూ. 6 వేలు

- ప్రసవానికి రూ. 3వేలు..
- ముడుపులు ఇస్తేనే బీమా డబ్బులు
- కార్మికశాఖలో ప్రతీ పనికి ఓ రేటు
- సొంతంగా వెళ్తే ఫలితం శూన్యం
- పైరవీకారుల ద్వారా వస్తేనే పనులు


కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న బాధితులు

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ పరవీ కారులకు అడ్డాగా మారింది. ఇక్కడ ఏ పని జరగాలన్నా చేతులు తడపాల్సిందే. కాసులిస్తేనే పనులు లేదంటే... ఏదో వంకతో రిజెక్ట్ చేస్తూ కార్మికులను కార్యాలయాల తిప్పుకుంటున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగీతిరిగి ఓపిక నశించిన బాధితులు మంగళవారం గద్వాల పట్టణంలోని కార్మిక శాఖ ముందు నిరసన తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన సుజాత అనే కార్మికురాలికి ఏడు నెలల క్రితం కాన్పు అయ్యింది. ఇందుకు సంబంధించి కార్మిక శాఖ నుంచి రూ. 30 వేలు రావాల్సి ఉంది. ఈ డబ్బులు రావాలంటే రూ. 3వేలు చెల్లించాలని మధ్యవర్తి అడగడంతో డబ్బులు ఇచ్చామని బాధితులు తెలిపారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రావడంలేదు. అలాగే బింగిదొడ్డికి చెందిన గోవిందు అనే కార్మికుడు గతేడాది సెప్టెంబరు 23న మృతి చెందాడు. ఇందుకు సంబంధించి మధ్యవర్తి రూ. 6 వేలు తీసుకున్నాడు. కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 1.30 లక్షలు రాలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇలా చాలామంది కార్మికులతో మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసుకొని పనులు చేయడం లేదు. మధ్యవర్తులను కాదని నేరుగా కార్యాలయానికి వెళ్తే అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు, మధ్యవర్తులు కుమ్మక్కై కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కాన్పు చేయించుకొని 11 నెలలు అవుతోంది..

కాన్పు చేయించుకొని 11 నెలలు అవుతోంది. నేటికీ తనకు రావాల్సిన రూ.30 వేలు ఇవ్వలేదు. అధికారులకు, మధ్యవర్తులకు డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారు. తాను ఇవ్వనందుకు తనను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని అయిజ మండల కేంద్రానికి చెందిన మాల బజారమ్మ మంగళవారం కార్యాయం ముందు నిరసన తెలిపారు.

అధికారుల పేరుతో గ్రామాల్లో పర్యటన...

గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన ఓ యువకుడు కార్మిక శాఖలో ఉద్యోగినంటూ.. లేబర్ కార్డులు ఇప్పిస్తానని, మృతిచెందిన కార్మికులకు బీమా చేయిస్తానని వేలల్లో డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం అంతా కార్మిక శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే అలంపూర్ మండల కేంద్రంలో లేబర్ కార్డుల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు వెళ్లగా అక్కడ ఉన్న మీసేవా నిర్వాహకులు గొడవకు దిగినట్లు తెలుస్తోంది. అయితే కార్మికశాఖలో ఉన్న ఓ అధికారికి, ఈ యువకుడికి మధ్య లావాదేవీలు ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే ఇటిక్యాల మండలం కొండేరు, ఉదండాపురం గ్రామాలలో ఈ యువకుడు ఒక్కో కార్డుకు డబ్బులు వసూలు చేసి 1000 కార్డులు తీయించినట్లు సమాచారం.

ఇక్కడ ప్రతీ పనికి పైసలివ్వాల్సిందే..

జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖలో ప్రతీ పనికి ఒకరేటు ఉంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక్కడ పనిచేసే కొందరు సిబ్బంది నేరుగా డబ్బులు వసూలు చేస్తుంటే మరి కొందరు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా డబ్బులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో కార్మికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు జిల్లా కేంద్రంలో దళారులు ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని కార్మికశాఖలో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులతో పాటు అధికారులకు కూ డా ఇందులో వాటా ఇస్తేనే పనులు చకాచకా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దళారులను ఆశ్రయించొద్దు

దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అసిస్టెంట్ లేబర్ అధికారి వేణుగోపాల్ అన్నారు. ఆరు నెలల నుంచి ఇప్పటివరకు 1500 క్లైమ్‌లు క్లియర్ చేసాం. సరైన ధ్రువపత్రాలు లేక ఫైల్ వెనక్కి వస్తున్నాయి. దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాలి. - వేణుగోపాల్, అసిస్టెంట్ లేబర్ అధికారి



క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చిన్నంబావి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన కాటమోని రామన్ గౌడ్ (48) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ రాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి సంపు నింపేందుకు బోర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. అతడి భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా యువతి...

కొత్తకోట (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండ లంలోని కానాయపల్లిలో ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. కొత్తకోట పట్టణానికి చెందిన బుచ్చిరెడ్డి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంట్లో కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుర్మ య్య, చెన్నమ్మ దంపతుల కుమార్తె బాలమణి (24) మూడేళ్లుగా కూలీ పని చేస్తుంది. మంగళవారం సాయంత్రం ఆమె మృతి చెందింది. బుధవారం ఉదయం విషయం తెలియడంతో తల్లిదండ్రులు కానాయపల్లికి చేరుకున్నారు. తమ కుమార్తె మృతికి బుచ్చిరెడ్డే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

మరికల్ (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పసుపుల గ్రామ స్టేజీ దగ్గర బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. మరికల్‌కు చెందిన శివ(30) మరికల్ నుంచి రైయిచూర్ వైపు తన బైక్‌పై వెళ్తుండగా, మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లికి చెందిన రాజు, మక్తల్ మండలం జెక్లెర్ గ్రామం నుంచి పాల ఆటోలో మరికల్ వైపు వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై గ్రామస్థుల సమాచారం మేరకు ఏఎస్ఐ ఎల్లయ్య, మసూద్‌పాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తలకు బలమైన గాయాలైన ఆటో డ్రైవర్ రాజును 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

» భూమి హద్దులపై వివాదం

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని కర్నె తండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నె తండాలోని సర్వే నెంబర్ 71లో పట్టాదారు జాతర నాయక్ సర్వే చేయిస్తుండగా, పక్క పొలం వారు హద్దులు చూపిస్తున్న క్రమంలో వివాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన కొడావత్ కిషన్, కొడావత్ లక్ష్మణ్, చిన్యా, లక్ష్మణ్, మాన్య, శాంతి, రమేశ్, పక్క పొలానికి చెందిన ఇస్లావత్ మాన్య, విజయ్, శ్రీను, సోమ్లా, రవి, కృష్ణల మధ్య ఘర్షణ జరిగింది. గాయపడిన వ్యక్తులను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైతు కొడావత్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు.

చోరీ కేసులో యువకుడి రిమాండ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గద్వాలలో ఓ వివాహ వేడుకలో బంగారు చైన్‌ను చోరీ చేసిన నూర్‌బాషాను బుధవారం అరెస్టు చేశామని పట్టణ ఎస్ఐ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గద్వాల నదిఅగ్రహారం సమీపంలోని ఎస్వీ ఈవెంట్ హాల్‌లో వారంక్రితం (17న) వివాహ వేడుకలకు ఖమ్మం జిల్లాకు చెందిన సత్యనారాయణ హాజ రయ్యారు. ఈ సమయంలో అతని వద్ద 13గ్రాముల బంగారు చైన్ చోరీకి గురైంది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి సీసీపుటేజీల ఆధారంగా స్థానికుల విచారణ అనంతరం పోలీసులు చోరీకి పాల్పడింది. పట్టణానికి చెందిన నూర్‌బాషా అని అనుమానించారు. నిఘాపెట్టి బుధవారం జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో, కోర్టులో హాజరు పరిచి, న్యాయాధికారి ఆదేశంతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సీడ్ పత్తి సబ్ ఆర్గనైజర్ అరెస్టు

మల్దకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాల నిల్వ కేసులో సబ్ ఆర్గనైజర్ శ్రీనును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మల్దకల్ ఎస్ఐ నందీకర్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం మల్దకల్ మండలంలోని కుర్తిరావులచె రువు గ్రామ శివారులోని పొలంలో నిల్వ చేసిన నకిలీ సీడ్‌పత్తి విత్తనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సబ్‌ఆర్గనైజర్ శ్రీ నును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీని వెనుక ఇంకా ఎవరైనా ఉంటే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆటాడుకుందాం...రా

» వచ్చేనెల 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

» గ్రామ స్థాయిలో 10, మునిసిపాలిటీల్లో 5 కేంద్రాలు

» పూర్తయిన శిక్షకుల ఎంపిక



శ్రీరంగాపూర్‌లోని వేసవి క్రీడా శిబిరంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ముగిసింది. వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకొనేలా, వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసేందుకు సమాయత్తం అవుతోంది. ఇప్పటికే కోచ్‌ల ఎంపికను కూడా పూర్తి చేసింది. వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణా శిబిరాలు కొనసాగనున్నాయి.

ఏ ఆట ఎక్కడ?

జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో 10, మునిసిపాలిటీల్లో ఐదు క్రీడా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి ఉన్న కోచ్‌లు ఇది వరకే దరఖాస్తు చేసుకోగా ఎంపిక కూడా పూర్తయింది. మునిసిపాలిటీల్లో అవసరాన్ని బట్టి మరో రెండు శిబిరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మదనాపూర్‌లో వాలీబాల్, గోపాల్‌పేట, ఏదుల, వీపనగండ్ల గ్రామాల్లో ఫుట్‌బాల్, ఘణపూర్, అప్పరాలలో అథ్లెటిక్స్ శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే పెద్దమందడి, కడుకుంట్ల, మాందాపూర్‌లలో హాకీ, మూలమల్లలో కబడ్డీ క్రీడా శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వనపర్తి మునిసిపాలిటీలో కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, చెస్ క్రీడలలో శిక్షణ ఇచ్చేందుకు నాలుగు శిబిరాలను ప్రారంభించనున్నారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో వాలీబాల్ శిబిరం ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థులకు నెల రోజుల పాటు శిక్షణ

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం కోచ్‌లు వివిధ క్రీడా అంశాలలో తర్ఫీదు ఇవ్వనున్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాల బాలికలు తమ ఆసక్తిని శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని క్రీడా శాఖ అధికారులు కోరుతు న్నారు. క్రీడా పరికరాలను ప్రభుత్వమే సమకూర్చడంతో పాటు, ఒక్కో శిబిరం నిర్వ హణ కోసం శిక్షకుడికి రూ.4 వేలు గౌరవ వేతనం, మైదానం నిర్వహణ కోసం మరో రూ. 1000 ఇవ్వనున్నది. శిబిరాల్లో మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు, మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉంచుతారు.

సద్వినియోగం చేసుకోవాలి



క్రీడా శిబిరాల నిర్వహణకు శిక్షకుల నుంచి దరఖాస్తులను స్వీకరించాం. శిబిరాలను నిర్వహించేందుకు స్థలాల ఎంపికను పూర్తి చేశాం. వేసవి క్రీడా శిబిరాలు విద్యార్థులు తమ క్రీడా ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవడానికి చక్కగా సహాయపడతాయి. వేసవి సెలవులను సమయాన్ని వృథా చేయకుండా క్రీడలపై దృష్టి సారిస్తే ఉత్తమ క్రీడాకారులుగా రాణించ అవకాశం ఉంటుంది. విద్యార్థులు క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

- సుధీర్ కుమార్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన

» ఎన్ఎంసీ ప్రత్యేక పరిశీలకులు డా. రవికుమార్



నూతన పద్ధతులతో విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధ తులను అనుసరించి విద్యార్థులకు బోధన చేయాలని జాతీయ విద్యామండ లి(ఎన్ఎంసీ) ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ వైద్యకళాశాలలో మూడు రోజుల బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముం దుగా ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ వైద్యమండలి వైద్య విద్యలో కొత్తగా కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఈ విధానం ద్వారా విద్యాబోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో మెళకువలపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ విద్యా విధానం విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని, అధ్యాపకుల పదోన్నతులకు కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఈ అంశంపై అవగాహన పెంచుకొని వైద్యవిద్యలో మార్పులు తీసుకురా వలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్, ఎంఈయూ కోఆర్డినేటర్ ఉషారాణి, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌ప్రకాశ్, ఆయా విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అక్షయకు ఘన సన్మానం

» ఇంటర్ 'ప్రథమ' పరీక్షల్లో స్టేట్ ఫస్ట్

» అభినందించిన కలెక్టర్, ఎమ్మెల్యే



అక్షయను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

దామరగిద్ద, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో అత్యుత్తమ ఫలితం సాధించిన విద్యార్థిని అక్షయను నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఘనంగా సన్మానించారు. దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన చెన్నారం అక్షయ హైదరాబాద్‌లోని వాలివోక్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతోంది. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 469/470 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఆమె తల్లిదండ్రులు విజయ, వెంకటప్పలను వేదికపైకి పిలిచి అభినందించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి, జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, ఎఎంసీ డైరెక్టర్ వెంకటప్ప, ఎంపీడీవో సాయిలక్ష్మి, తహసీల్దార్ జమీల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఖాజా, లక్ష్మణ్, ఆనంద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా మహబూబ్‌నగర్

» ప్రకటించిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌ను మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా ప్రకటించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మాన్యువల్ స్కావెంజర్స్ జిల్లా స్థాయి సర్వే కమిటీ సమావేశాన్ని గత నెల 27న కలెక్టర్ అధ్యక్షతన ఐడీవోసీ కాంప్లెక్స్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. కమిటీ విధి విధానాలకు సంబంధించి గ్రామ, పట్టణ స్థాయి, రైల్వేలు తదితర సంస్థలలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 7 వరకు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజింగ్ ఎక్కడా లేదని ఆ నివేదికలో పేర్కొన్నట్లు వెల్లడించారు. అయితే ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు సెల్ఫ్ డిక్లరేషన్‌కు సమయం ఇచ్చిందని, కానీ తాము స్కావెంజింగ్ చేస్తున్నట్లు ఎవరూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ఫిర్యాదు చేయలేదు కనుక పాలమూరును మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా ప్రకటించినట్లు తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఏఈ ఏసీబీ అధి కారులకు పట్టుబడ్డాడు. ఖిల్లాఘణపూర్ మం డలం టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కొండయ్య బుధవారం వనపర్తి డీఈ కార్యాల యంలో ఓ వ్యక్తి నుంచి రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రె డ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబ్‌నగ ర్ ఏసీబీ డీఎస్పీ సిహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఖిల్లాఘణపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో నిర్మించిన తిరుమల ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 160 కేవీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏఈ కొండయ్య లంచం డిమాం డ్ చేశాడు. ఇదే పని కోసం గతంలో కూడా రూ. 30 వేలు తీసుకున్నాడు. ప్రస్తుతం రూ. 20 వేలు డిమాండ్ చేయగా, రూ. 10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ డబ్బులు తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏఈ కొండయ్య డబ్బు తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యిందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయనను అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. అధికా రులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు.

ప్రారంభమైన స్కానింగ్ సేవలు

» గర్భిణులకు తగ్గిన ఆర్థిక భారం » ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు పునఃప్రా రంభమయ్యాయి. ఆసుపత్రిలో రేడియా లజిస్టు లేకపోవడంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో గర్భిణులు స్కానింగ్ కోసం ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయించి ఆర్థిక భారం మోయాల్సి వచ్చింది. ఈ సమస్యపై గత నెల 27న 'గర్భిణులపై స్కానింగ్ భారం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అందుకు వైద్యశాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి ఇద్దరు ఎస్ఆర్ (సీనియర్ రెసిడెంట్) రేడి యాలజిస్టులను నియమించారు. త్వరలోనే వైద్యులతో సమావేశం నిర్వహించి, వచ్చే నెల నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు, మాతా శిశు సం రక్షణ కేంద్రంలో స్కానింగ్ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసు కొస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు తెలిపారు.



వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులకోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



అయిజలో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

సెలవులొచ్చేశాయ్

పరీక్షలు ముగిశాయి.. వేసవి సెలవులు వచ్చేశాయి.. ఈనెల 23 నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు బుధవారం ఇంటి బాటపట్టారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి తమ పిల్లలను బస్సులు, ప్రైవేటు వాహనాల్లో స్వగ్రామాలకు తీసుకెళ్లారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా మారాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి (ఆంధ్రజ్యోతి)/ నారాయణపేట/ అయిజ



వనపర్తి పట్టణంలోని మర్రికుంట నుంచి ఇంటి బాట పట్టిన విద్యార్థి



నారాయణపేటలో బడికి టాటా చెప్తున్న విద్యార్థులు





వనపర్తి పట్టణం నుంచి ఇంటి బాట పట్టిన విద్యార్థులు



పేట ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థినులు



ఇంటర్వ్యూ

భూ వివాదాల పరిష్కారానికి చర్యలు

- ఎండీ సలీముద్దిన్, గట్టు తహసీల్దార్



గట్టు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గట్టు మండలంలో నెలకొన్న భూ వివాదాల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తున్నానని తహసీల్దార్ ఎండీ సలీముద్దిన్ అన్నారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల ప్రజలకు సేవలు అందించటానికి ప్రయత్నిస్తున్నానంటూ పలు విషయాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

● భూ భారతిలో రిజిస్ట్రేషన్‌లు ఎలా జరుగుతున్నాయి?

ధరణి పోర్టల్ స్థానంలో కొత్తగా భూమి హక్కుల రికార్డు భూ భారతి వచ్చింది. ఇప్పటికైతే ఎలాంటి సమస్యలు లేకుండా రిజిస్ట్రేషన్‌లు భూ భారతి ద్వారా జరుగుతున్నాయి.

● కార్యాలయంలో మధ్యవర్తుల జోక్యం అధికంగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి?

ప్రజలు తమ పనులను నిర్భయంగా కార్యాలయానికి వచ్చి తనతో చేసుకోవచ్చు. మధ్య వర్తులను ఆశ్రయించవద్దు. ఎలాంటి పని ఉన్నా తనను సంప్రదించాలి. కార్యాలయంలో మధ్య వర్తులను నేను ప్రోత్సహించను.

● భూములకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నారా?

తాను తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న నాటినుంచి రోజు వారిగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాడానికి చర్యలు తీసుకుంటున్నాను. భూములకు సంబంధించి అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని సిబ్బంది ద్వారా దశల వారిగా పూర్తి చేయాడానికి చర్యలు తీసుకుంటున్నాను.

● కార్యాలయంలో అవినీతి అక్రమాలు పెరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి?

కార్యాలయంలోని సిబ్బంది అందరికి తగు సూచనలు ఇచ్చాను. అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తెలపడం జరిగింది. పారదర్శకంగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నా ఇందుకోసం ప్రజల సహకారం అవసరం.

న్యూస్ బాక్స్

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెడ్డి సేవాసమితి నాయకులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీటీపీ కల్యాణ మండపం వద్ద బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అధ్యక్షుడు వెంకటరాజా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సేవా సమితి ఆధ్వర్యంలో గడచిన ఎనిమిదేళ్లుగా ప్రతి వేసవిలో చలి వేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెడ్డి సేవాసమితి జిల్లా కమిటీ, మహిళా కమిటీ, యువజన, పట్టణ, మండల కమిటీ సభ్యులు ఉన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జిల్లా కేంద్రం గద్వాలలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం సెషన్‌లో జరిగిన టెన్త్ పరీక్షల కు 455 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 92.09 శాతంతో 419 మంది హాజర య్యారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 204 మంది కి గాను 88.73 శాతంతో 181 మంది హాజరయ్యారని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని, ప్ర భుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీని వాసులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో ప దో తరగతి పరీక్షలకు ఆరుగురు విద్యార్థులకు 83.33 శాతంతో ఐదుగురు, ఇంటర్ పరీక్షలకు 80 మందికి గాను 92.5 శాతంతో 74 మంది హాజరైనట్లు వివరించారు.

మాజీ ఉపసర్పంచు మృతికి నివాళి

మల్దకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు సాయన్న బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్దకల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకుడు డి.శేఖర్‌నాయుడు బుధవారం గ్రామంలోని నివాసానికి వెళ్లి మాజీ సర్పంచు మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి చెందిన మనోహర్‌నాయుడు, శేఖర్‌నాయుడు ఆర్థిక సాయం చేశారు. మాజీ ఉప సర్పంచు తిమ్మప్ప, ఈరన్న, నర్సింహులు, దూగన్న, నాగన్న, వీఆర్‌వో రంగన్న, కిష్టన్న ఉన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

గద్వాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ శివలీల అన్నారు. బుధవారం మండల పరిధిలోని బస్సాపురంలో నిర్వహించిన బాలల సంరక్షణ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలలను పనిలో పెట్టుకున్న, బాల్య వివాహాలు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. సెల్‌ఫోన్ వాడకం వలన కలిగే నష్టాలతో పాటు దానిని మంచికోసమే ఉపయోగించాలని సూచించారు. బాలల రక్షణ కోసం 1098కు ఫోన్ చేసి వివరాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి భారతి, చైల్డ్ లైన్ కౌన్సిలర్ జయన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యాధికారుల నియామకానికి

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ సంతోష్ తదితరులు

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు అవసరమైన వైద్యాధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్‌లు సంయుక్తంగా సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వైద్య కళాశాలల్లో అసరమైన ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు, అసోసియేట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితర నియామకానికి అవసరమైన ఖాళీల వివరాలను శనివారం వరకు అందజేసినట్లైతే పొరుగు సేవల కింద నియామకాలు చేపట్టేందుకు సోమవారం రోజు ప్రకటన జారీ చేసేందుకు వీలు పడుతుందన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి వాటి పూర్తి వివరాల ప్రతిపాదనలను అందజేయాలన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది నియామకానికి పొరుగు సేవల ఏజెన్సీల ద్వారా నియామకాలు చేపట్టాలన్నారు. క్యాంటిన్ నిర్వహణకు మహిళా శక్తి సభ్యులకు కేటాయించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఇతర జిల్లాల్లోని ఆసుపత్రులకు ముఖ్యంగా కర్నూల్ ఆసుపత్రికి రెఫర్ చేయకుండా అన్ని రకాల వైద్యసేవలను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య అధికారుల నియామకాలు చేపట్టేటప్పుడు స్థానికులను ఎంపిక చేసినట్లైతే మంచి సేవలు అందించే అవకాశం ఉంటుందని సూచించారు. ఆసుపత్రి ఆవరణలోనే పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం ఐడీవోసీ సమావేశపు హాలులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని నిరుపేద అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఎల్-1 జాబితాతో ఉన్న 50 వేల మంది లబ్ధిదారుల నుంచి నియోజకవర్గానికి 3500 చొప్పున ఏడు వేల మంది లబ్ధిదారులను ఎంపికను పారదర్శకంగా చేయాల్సి ఉందన్నారు. ఇందుకు జిల్లా స్థాయి స్పెషల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లలో బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న 20 మందికి లబ్ధిదారులకు ఇటీవలే మొదటి విడతగా రూ. లక్ష చొప్పున నిధులు విడుదల చేశామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ఏప్రిల్ 30లోపు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేసి అర్హులైన వారిని తుది జాబితాలో ఎంపిక చేయాలన్నారు. నిర్మాణ దశలను బట్టి దశలవారిగా లబ్ధిదారులకు ప్రతీ సోమవారం వారి ఖాతాల్లోకి నేరుగా డబ్బులను జమ చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు గ్రామకార్యదర్శి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎల్.ఆర్.ఎస్ గడువు ఈ నెల 30న ముగుస్తుందన్నారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఉన్నారు.

భక్తుల బాధలు ప్రభుత్వానికి పట్టదా?

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



ప్రసాద్ స్కీం భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

అలంపూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం భక్తుల కోసం నిర్మించబడిన ప్రసాద్ స్కీం వసతి గృహాలకు సరైన మౌలిక సదుపాయాలు అందించడం లేదని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అన్నారు.

అలంపూరు పట్టణ కేంద్రంలో మండల అధ్యక్షుడు గొంగళ్ల ఈశ్వర్, శరత్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ప్రసాద్‌స్కీంతో పనులు పూర్తయిన గృహాలు, భోజన శాలను వినియోగంలోకి తీసుకురావడం లేదని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ నిత్యం జోగుళాంబ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం కేంద్ర ప్రభుత్వం 80 కోట్లు మంజూరు చేస్తే 36 కోట్లతో ప్రారంభించి కేవలం 28 కోట్లతో ప్రసాద్ స్కీం భవనాలను రెడీ చేశారన్నారు. ఈ భవనాలను వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. కొన్ని నెలల క్రితం కలెక్టర్ పరిశీలించి ఆలయంలో ప్రస్తుతం ఉన్న అన్నదాన సత్రం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని, గ్రౌండ ఫ్లోర్, ఆ పైన సత్రాలు భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులకు అప్పగించారన్నారు. భవనాలను ఇప్పటి వరకు కూడా ఉపయోగంలోకి తీసుకురాకుండా ఆలయ అధికారులు, ప్రభు త్వం కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భవనాల్లో నేటికీ ఎటువంటి మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కావున తక్షణమే భోజన శాలను కొత్తగా నిర్మించిన ప్రసాద్ స్కీంలోకి తరలించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి రాజగోపాల్, రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడు రాజశేఖర్ శర్మ, జిల్లా కౌన్సిల్ నెంబర్ రంగస్వామి అలంపూరు పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, మహేష్, కార్యదర్శి పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన ఏర్పర్చుకోవాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ

కేటీదొడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైనదని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు. బుధవారం కేటీదొడ్డి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని చట్టం, అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందన్నారు.

ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యుల్స్ పొందుపరిచారని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేయాలో రైతులకు అర్థమయేది కాదన్నారు. భూ భారతిలో 6 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు.

భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు.

వారసత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. ఈ దరఖాస్తులపై తహసీల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గడువు తర్వాత ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఆర్డీవో శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హన్మంతు, తహసీల్దార్ హరికృష్ణ, వ్యవసాయ అధికారి సజీద్ రెహమాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ బోధన



ధరూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీఎస్, యూఎం విద్యార్థులు

ధరూరు/మల్దకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఉచిత విద్యతో పాటు అన్ని వసతులతో ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ బోధన అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పాఠశాలల హెడ్‌మాస్టర్లు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ధరూరు మండల కేంద్రంలో ధరూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు బడిబాట ర్యాలీని మండల విద్యాధికారి రవీంద్రబాబు ప్రారంభించారు. అనంతరం పాఠశాలల్లో పీటీఏ సమావేశం నిర్వహించి తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. హెడ్‌మాస్టర్లు కేఎస్ యోగేందర్, రెహానా సుల్తానా, మహేష్, భార్గవి, కళ్యాణి, సీఆర్‌పీ నర్సింహులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రోగ్రెస్ కార్డులు అందజేత

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్దకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో ర్యాలీని ప్రాధానోపాధ్యాయుడు సురేష్ ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సురేష్, ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, సుజాత, జ్యోతి, శుభ వరలక్ష్మి, రమణమ్మ, మణెమ్మ, జాకీర్‌హుసేన్, బలరాముడు, నాగేశ్వర్వరావు, నాగరాజు, ప్రదీప్, రిజ్వానా, జరీనా, లక్ష్మీ, బజారన్న, మునెప్ప ఉన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సహాయ నిధి

ఎర్రవల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ సహాయ నిధి అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోతురాజు సోమనాద్రి అన్నారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. బోయ మహేశ్వరికి రూ.32,500లు, డేగ మద్దిలేటికి రూ.60వేల చెక్కులను అందించారు. నాయకులు వెంకటేష్, సిరాజ్, బీచుపల్లి, హనుమంతు, తిమ్మప్ప గౌడ్, వెంకటస్వామి గౌడ్, బలరాముడు, జాకీర్, బజారన్న, పాల బీచుపల్లి ఉన్నారు.

ఈత సరదా

విషాదం కాకూడదు

- ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, యువకులు ఈత నేర్చుకోవడానికి జలాశయాల వద్దకు వెళ్లడం ద్వారా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, ఈత సరదా కుటుంబంలో విషాదం నింపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాస రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈతరాని వారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని, ఈతను నేర్చుకునే చిన్నారులు, యువతీ యువకులు ఈత వచ్చిన వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను జలాశయాల వద్దకు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, మహిళలు బట్టలు ఉతికేందుకు చెరువుల దగ్గరకు కూడ ఈత వచ్చిన కుటుంబ సభ్యుల వెంట మాత్రమే వెళ్లాలన్నారు. అలాగే పోలీస్ కళా బృందం ద్వారా గ్రామాల్లో ఈతకు వెళ్లే చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మానవపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈదమ్మ పండుగ సందర్భంగా బుధవారం న్యూకేటగిరి బండలాగుడు పోటీలను రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతలు పాల్గొనగా మొదటి బహుమతి 40 వేలు, ఎద్దుల జతలకు అందించారు, రెండో బహుమతి రూ. రూ.30వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి 10వేలు అందించారు. రైతుసంఘం అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

- జిల్లా ప్రధాన న్యాయాధికారిగా ప్రేమలత, అడిషనల్ డిస్ట్రిక్ న్యాయాధికారిగా రవికుమార్



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న త్రిపాఠి

గద్వాల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయాధికారిగా ఎన్.ప్రేమలత, ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ న్యాయాధికారిగా రవికుమార్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రిపాఠి, న్యాయవాదులు పూజారి శ్రీధర్, పూజారి శ్రీలేఖలు ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కావలి నర్సింహులు, ఉపాధ్యక్షుడు ఎం.డి.ఖాజా మొహినుద్దీన్, ప్రధాన కార్యదర్శి జయసింహారెడ్డిలు న్యాయాధికారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గద్వాల జిల్లా ఎస్సీ ఎస్టీ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు యాకోబ్, జాయింట్ సెక్రటరీ నాగయ్య, సభ్యులు సురేష్, పవన్‌కుమార్, సూర్యప్రసాద్, రవిలు వారిని గౌరవపూర్వకంగా కలిసి పూలబొకేతో శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌కు సన్మానం



ఇంటర్‌లో 979 మార్కులు సాధించిన వినోద్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసులు మిత్రులు

గట్టు/అయిజ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం సన్మానించారు. మండలంలోని రాయపురం గ్రామానికి చెందిన లావణ్య ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో 439/440మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఇందుకు గాను బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంతునాయుడు గ్రామాన్ని సందర్శించి విద్యార్థినిని శాలువాతో సత్కరించి స్వీట్ తినిపించారు.

తప్పట్లమొర్సు విద్యార్థికి సన్మానం

మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన బొప్పల శ్రీనివాసులు కుమారుడు బొప్పల వినోద్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 979/1000 సాధించాడు. ఈ విద్యార్థిని బొప్పల శ్రీనివాసులు మిత్రులు శాలువాతో సత్కరించి అభినందించారు. సంచార జాతుల్లో పుట్టి ఊరూరు తిరిగితే గాని పూట గడవని స్థితిలో ఉండే తోలుబొమ్మలాట ఆడించే కులంలో ఎదిగిన విద్యా కుసుమం అని పవన్‌కుమార్, ప్రసాద్, శంకర్, ఘట్టన్న, చిన్నయాదవ్, తిరుమలేష్, రమేష్‌గౌ డు పేర్కొన్నారు.

బాలిక విద్యకు ప్రోత్సాహం అందించాలి

బాలికల విద్యకు ప్రోత్సాహం అందించాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ కన్వీనర్ తాహర్ అన్నారు. అయిజ పట్టణానికి చెందిన జహీర్ కుమార్తె అయేషా ఇంటర్ ఎంపీసీలో 463 మార్కులు సాధించింది.

ఈ సందర్భంగా బుధవారం అయేషాను తాహర్ శాలువా కప్పి అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

● సీడీపీవో హేమలత



మల్దకల్‌లో బాలల హక్కులపై ఆట,పాటల రూపంలో వివరిస్తున్న కళాకారులు

మల్దకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీడీపీవో హేమలత అన్నారు. అదే సమయంలో బాలబాలికలకు చదువు ప్రాముఖ్యత, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో బుధవారం మల్దకల్ మండల కేంద్రంలోని దశమి కట్ట వద్ద బాలల హక్కులు, చట్టాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ బాలికలకు చిన్నవయస్సులో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలకార్మిక వ్యవస్థ వల్ల పిల్లల భవిష్యత్‌నాశనం అవుతుందని, పిల్లలను పనులకు పంపకుండా బడులకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. పోషణ్ పక్షం కార్యక్రమంలో భాగంగా వెయ్యి రోజుల పోషణ కార్యాచరణలో మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, బయట ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. బాల్యవివాహాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, రక్తహీనత, పౌష్టికాహారం, హింసల నుంచి పిల్లలను రక్షించడం తదితర అంశాలపై కళాకారులు ఆట, పాటల రూపంలో వివరించారు. ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూ ప్రకాష్, సూపర్‌వైజర్లు నాగరాణి, యామని, సంధ్య, సాంస్కృతిక సారథి కళాకారులు కృష్ణ, ప్రసాద్, హజరత్, కేశవులు, స్వామి, భూపతి, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కిశోర బాలిక లు, గ్రామస్థులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం



ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తిగల ఆధ్యాత్మిక కేంద్రాలు, దేవాలయాల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. పట్టణ సమీపం నదీ అగ్రహారం వద్ద అహోబిళ మఠం 27వ పీఠాధిపతి బృందావనం, ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మఠానికి వచ్చిన ఎమ్మెల్యేకు అర్చకులు, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వ్యక్తులను సన్మార్గంలో నడిపే శక్తి ఆలయాలకు ఉంటుందని, ఆలయాల పవిత్రతను కాపాడుకునేందుకు అర్చకులు, వేద పండితులు తమవంతు కృషి చేయాలని కోరారు. కేటిదొడ్డి మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, నాయకులు రఘువర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, సవారన్న, బాలు ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసానికి మార్గం



పుస్తక దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా సూచించారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. 'చిరిగిన చొక్కానైనా ధరించు.... ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో... అన్న మహాత్మా గాంధీ సూక్తిని ఉటంకించి ప్రిన్సిపాల్, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు చారిత్రక, సాంస్కృతిక సంబంధమైనవి, మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఎదగాలన్నారు. ఇదే సందర్భంలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రపంచ భాషగా గుర్తింపొందిన ఆంగ్లంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు, సమాచారంతో కూడిన పుస్తకాలను అధ్యయనం చేయవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు.